

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

డిసెంబర్ 2014

సంపుటి : 20 238 సంచిక : 12




# మాతృభాష నెలా మొలకెత్తించేది?
## - జనులా? జననాయక ఘనులా? - గరుడ వాహనా! నీవే శరణు!!

**భా**షా రాష్ట్రం కోసం పోరాడిన వారం. భాషా రాష్ట్రం యేర్పడిన తరువాత యిప్పటివరకూ మాతృభాషను పట్టించుకున్నవారొకరూ లేరనడం బాధాకరం. భారతరిపబ్లిక్‌లో తొలి భాషా రాష్ట్రంగా తెలుగు రాష్ట్రమే యేర్పడినది. మాతృభాషను పట్టించుకోని తొలి రాష్ట్రముగా మారింది. ఇందుకు ప్రజలు కారకులా? ప్రభుత్వాలు కారకులా? ఎవరిని అనాలి? ఏమని అనాలి?

ఏ ప్రభుత్వ సహకారమూలేని అన్యరాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు, మాతృభాష కోసం తహతహలాడుతున్నారు; విదేశాల్లోని తెలుగువారు తమ భాషపై విరివిగా ఆసక్తి చూపుతున్నారు, మహాసభలు జరుపుతున్నారు. ఇహ రాష్ట్ర పరంగా చూద్దామంటే- పాలనా సౌలభ్యంగా యేర్పడిన ఇరు రాష్ట్ర ప్రభుత్వాల లోనూ సౌలభ్యం లేదు.

పాకిస్థాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వంపై వైషమ్యం చూపినట్లు ఇరు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు ఒకరంటే ఒకరు పొసగకుండా ఉన్నారు. రాష్ట్రం లోని నాయకులే, రాష్ట్ర నాయకులతో విభేదిస్తున్నారు. స్థానికంగా ఉండే రాజకీయాలు రాష్ట్రస్థాయి కెదిగాయి.

జనం మనంలో సమైక్యతా భావం ఉన్ననూ వర్ధిల్లడం లేదు. నాయకులు అడ్డగోలుగా ఉన్నారు. పెనంమీద మిడతల్లా జనం వేగిపోతున్నారు. రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న జలశక్తి, జలవిద్యుచ్ఛక్తిల పోరాటం ఆరంభమైంది. రాష్ట్రాభివృద్ధి కోసం ఆరాటపడవలసిన నాయకులు పోరాట ఆరాటాన్ని పెంచుకుంటున్నారు.

**చేయెత్తి జైకొట్టు తెలుగోడా**
**గతమెంతో ఘనకీర్తి కలవోడా-**
**వీర రక్తపు ధార వారవోసిన సీమ**
**వెలనాడు నీదేరా పలనాడు నీదేరా**

-అన్న తెలుగు కవి వేములపల్లి శ్రీకృష్ణ మేలుకొలుపు వేడికోలయింది.

ఏ నాయకులున్నపుడు ఆ నాయకులకు జేజేలు పలికే జనం ఉండి నపుడు, వార్వారి గళముల్లో వేర్వేరు స్వరం పలుకదు.

ఫాస్టుఫుడ్‌లు అలవాటైనవారికి, పచ్చళ్ల అన్నం యెందుకు రుచిస్తుంది? వరి పండించే చాలా ఊళ్ళను పట్టణాలు కబళించేసాయ్. 'అ-ఆ' లను నల్లబోర్డులపై వ్రాసి బోధించే పాఠశాలలు కనుమరుగయ్యాయి. పంతుళ్లు మారారు. A B C D పట్టికలను వేలాడించే టీచర్స్ వచ్చారు. గురువుల పాఠ్య విధానం, బోధనం గురివిందగింజంత ప్రమాణం కూడా లేదు. చదువుకున్న వాడు కాకరకాయను కీకరకాయ అన్నట్లు- నవంబర్1న కాదు జూన్ 2న రాష్ట్రవతరణోత్సవం జరుపుకుందామంటున్నారు. చైత్ర వైశాఖములనే తెలుగు మాసపు పేర్లను మరచిపోయినట్లే, అక్టోబర్ 1, నవంబర్1లను మరిచిపోయే రోజులు వస్తున్నాయి.

ఒకటి తరువాత వచ్చేది రెండే! తెలుగు రాష్ట్రాలుండేదీ రెండే! ఇరువురు ముఖ్యమంత్రులూ, ఇరువురు స్పీకర్లూ, ఇరు శాసనసభలూ ఉన్నాయి. ఒకటిగా ఉండని వారికి ఒకట్లు జ్ఞాపకం ఉండవు. ఇలాటప్పుడు ఇరుకున పడేది నదులూ, నదాలూ, జనపదాలూ, భాష యిరుకున పడకేఁవిచేస్తాయ్. 'భాష' అనే రెండక్షరాలు విడిపోతున్నాయి. 'హే భగవాన్ నీకు ఆసనం వేసి కూర్చోపెడదామంటే- అతిలోచన బలిష్ఠుడైన గరుత్మంతుడు నీ వాహనం! నిన్నాభరణంతో మురిపింప చేద్దామంటే కౌస్తుభం నీ ఆభరణం! కనకమయుణ్ణి చేసి ఆనందిద్దామంటే లక్ష్మీదేవి కన్నా మించిన సిరేమున్నది?

నీవు వాక్కునకు అధిపతివి. కావున వాక్కులు మాతృభాషను పలికేట్లు చేయాలంటే నీవు దివి నుంచీ భువికి దిగిరావాలి. మా రాజధాని నిర్మాణం జరగాలి. వరిచేలు పండాలి; మా అమ్మ వండాలి, మా కడుపు నిండాలనే ధ్యాస మాకు కల్పించు. దేశమంటే మట్టికాదు; దేశమంటే మనుష్యులు. మనుష్యుల నోట మట్టికొట్టే, ఆలోచనల్ని కలుగనీయకు! సుజలాం సుఫలాం మలయజశీతలామ్; సస్య శ్యామలాం వందే మాతరమ్! అనే వాగ్విలాస మందహాసుల్ని చెయ్యాలి ప్రభూ!



బుధజన విధేయుడు

*- గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# ఆనాడే అఖిల భారత జాతీయ కాంగ్రెసులో అత్యున్నత మేధాశీలిగా, మహాత్మాగాంధీ ఆలోచనాపరునిగా భోగరాజ పట్టాభి సీతారామయ్య గాంధీకి, కాంగ్రెసుకూ భోగ జవసత్వం కలిగించాడు.!!



నవంబర్ 24వ తేదీ పట్టాభి జననం. ఎంతమంది ఆయన్ను తలచుకుంటున్నారు. గాంధీజీ ఆలోచనా బుర్ర పట్టాభిగారే. పట్టాభి లేకుంటే కాంగ్రెసుకు చరిత్రలేదు. కాంగ్రెసు ప్రచురించిన మూడేమూడు బులిటెన్లు ఆధారంగా, 1600 పేజీల కాంగ్రెస్ చరిత్రగా రెండునెలల్లోగానే రచన పూర్తిచేయుట! 1942 సం॥ములో అప్పటికింకా భారత్ స్వాతంత్రదేశం రాలేదు. క్రిప్సు రాయబారం ఢిల్లీ వస్తున్నది. అదే రోజున పట్టాభిగారు తన చిన్న కుమారుని పెండ్లి నిమితార్థం మంచిలీపట్నం బయల్దేరుతున్నారు. గాంధీ పట్టాభిగారిని పిలిపించి నీవు లేకపోతే వారితో చర్చించే వారెవరున్నారు. తప్పనిసరిగా నీవు ఢిల్లీలోనే ఉండాలంటే- కుమారుని పెళ్ళికి కూడా ఆయన వెళ్ళలేదు. అదీ పట్టాభి ఘనత!

**అసమాన ప్రతిభాశాలి, అమేయ ప్రతిభావంతుడైన డా॥ పట్టాభికి ఈ సంచిక అంకితం.**


బందరులో 1880 సం॥ము నవంబర్ 24న కృష్ణాజిల్లాలో సుప్రసిద్ధ ఆరువేల నియోగుల కుటుంబంలో భోగరాజు సుబ్రహ్మణ్యం దంపతులకు జన్మించిన సీతారామయ్య, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడం జరిగింది. అయినా కఠోర దీక్ష, పట్టుదలతో ఇంటర్మీడియట్ వరకూ చదివి, ఆపైన వైద్యవిద్యను అభ్యసించి 'పట్టా'ను పొందారు! ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే పట్టాభి కుశాగ్రబుద్ధిని మెచ్చి, ఆ పట్టణంలోనే ప్రముఖ న్యాయవాదిగా ఉన్న వెంకటరత్నంగారు తన కుమార్తె రాజేశ్వరినిచ్చి వివాహం చేసారు. ఆ రాజేశ్వరి పాణిగ్రహణ బలమో ఏమో బందరు పట్టణంలో డాక్టరుగా వైద్యవృత్తిని చేబట్టి, సుప్రసిద్ధ డాక్టరుగా, మంచి సంపాదన గల డాక్టరుగా డబ్బు సంపాదిస్తున్న రోజుల్లోనే, గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ ప్రభావం పట్టాభి యశస్సును వశం చేసుకున్నది.

ఒక రకంగా చెప్పాలంటే గాంధీగారి తలలోని నాలుక పట్టాభి. ఆయన ఆంతరంగికుల్లో పట్టాభే ప్రథముడు. ఎంతటి క్లిష్టమైన లెఖ్ఖలనైనా వేళ్ళపై లెఖ్ఖించి చెప్పిన ఘనత పట్టాభిగారిదే!

ఓసారి గాంధీగారికి తెలుగు ప్రాముఖ్యతను చెబుతూ – చూడండి గాంధీజీ రూపాయి నాణెంపై ఆంగ్ల అక్షఱాలు తరువాత తెలుగు అక్షఱాలే ఉన్నాయ్. నోటులపై చూచినా ఆంగ్ల అక్షఱాల తరువాత తెలుగు అక్షఱాలే ఉన్నాయని ఘట్టిగా, ఒత్తి ఒత్తి చెప్పగలిగిన ధీరుడు పట్టాభి.

మహాత్మాగాంధీ గారిచే అఖిల భారత కాంగ్రెసు మహాసభ అధ్యక్షునిగా ప్రతి పాదించబడినవాడు పట్టాభి. ఆయన కోరుకుంటే ఎన్ని పదవులైనా వచ్చేవి. కొందరి ప్రోత్సాహంతో రాష్ట్ర గవర్నరు పదవిని చేబట్టారు. ఊఁఅంటే దేశాధ్యక్ష పదవి కూడా వచ్చేదేమో! రాష్ట్రంలో నగర నగరమునా, పట్టణమునా పట్టాభి విగ్రహాలు వెలయాలి. స్వాతంత్రం రాకపూర్వమే తెలుగు వారి సత్తా చూపిన పట్టాభి సీతారామయ్యకీ ప్రముఖాంధ్ర సంచికను అంకితమిస్తున్నాం. అంజలి ఘటిస్తున్నాం. ●

భోగరాజు పట్టాభి సీతారామయ్య - తాననుభవించే భోగములను త్యజించి, దేశ ప్రజల భోగములు కోసం అవిశ్రాంత కృషి చేసారు. ఏ దేశనాయకుడూ చేయని ప్రజాభ్యుదయ కార్యక్రమాలను ఏ నాయకుడూ చేయలేదన్నది నూటికీ నూరుపాళ్ళు సత్యం. ఏ మహా నాయకులూ చేయలేదంటే నివ్వెరపోవాలి. బ్యాంకింగు వ్యవస్థకూ అభ్యున్నతికీ ఆయనే నిలిచి, భారత లక్ష్మీబాంకు, ఆంధ్రా బాంకులను స్థాపించారు. ఇన్సూరెన్సు అభివృద్ధి కోసం హిందూస్థాన్ ఐడియల్ ఇన్సూరెన్సు మూలకారకుడు. భోగరాజువారి మార్గదర్శనంలో స్థాపింపబడిన ఆంధ్రా బాంకు యీనాడు జాతీయ బాంకులో ఒకటిగా ప్రగతిపథంలో నడుస్తున్నది. భారత లక్ష్మీబాంకును అనేక ఇతర చిన్న బాంకులను తన కడుపులో పెట్టుకున్నది. ప్రాక్పశ్చిమ దేశాల్లో ఈ బాంకు శాఖలున్నాయ్ ఇంత ప్రతిభా సంపత్తులను కలిగిన తెలుగువాడు కావడం బందరు బిడ్డకావడం మన అదృష్టం.



## శ్రీ శృంగేరి శారదా పీఠాధీశులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ స్వామివారి ఉపదేశం!

# సత్పురుషుల హింసించరాదు

ఆది శంకర భగవత్పాదులు సువర్ణహస్తాలతో స్థాపింపబడిన శంకరపీఠం శృంగేరి శంకర పీఠం. ఈ పీఠంలో పీఠాధిపతులైనవారందరూ వేదవేదాంగాలూ, తర్కశాస్త్రముల్లో బహుముఖ పాండిత్యము గలవారు ! సాధు సహృదయులు, సత్పురుష మహోదయులు. ఆ పరంపరలో 36వ పీఠాధిపతిగా శృంగేరి శారదా పీఠము నధిష్ఠించిన శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వామి వేదోపనిషత్సారమునూ వ్యాకరణ మునూ, అష్టాదశపురాణముల సారాన్ని ఔపోసన పట్టిన అపర అగస్త్యులు.

మా అభ్యర్థనను అంగీకరించి తమ ఉపదేశములను 'ప్రముఖాంధ్ర'లో నెలసి(స)రిగా ప్రచురించుకోవడానికి అంగీకరించారు. ప్రముఖాంధ్రకు 20వ సంవత్సరం నిండుతున్న యీ డిసెంబర్ సంచికలో– ఈ మహాత్పురుషుని కలం నుంచీ జాలువారిన 'సత్పురుషులను హింసించరాదు' ఉపదేశమును మా పాఠకుల కందిస్తున్నాం.

ఉత్తములైనవారితో సజ్జనులతో మనం కలిసిమెలిసి తిరుగుతుండవచ్చు.వారు మనకు చాలా బాగా తెలిసి ఉండవచ్చు. అయితే వారితో మాట్లాడే సమయంలో చాల జాగ్రత్తగా ఉండాలి. 'వారు నా స్నేహితులే కదా! నాకు బాగా తెలిసినవారే కదా! వారితో నేను ఎలా మాట్లాడినా వారేమీ అనుకోరు" అని ఆలోచిస్తూ వారి మనోభావాలను కించపరుస్తూ బాధపెట్టకూడదు. అలా మాట్లాడడం ప్రారంభిస్తే వారితో స్నేహం ఆ క్షణమే ముగియవచ్చు. వారు చాలా సున్నితమైన మనస్సు కలిగి యుండటమే అందుకు కారణం.

కృష్ణార్జునులను ఇందుకు ఉదాహరణగా తీసుకొనవచ్చు. కృష్ణుడు సాక్షాత్ పరమేశ్వరుడే అని గ్రహించని అర్జునుడు ఆయనను ఒక సామాన్యుని వలె భావించి మాట్లాడినాడు.

అయితే విశ్వరూప సందర్శనమైన పిదప, శ్రీకృష్ణపరమాత్మ మహిమను గ్రహించి, పరమాత్మను క్షమించమని వేడుకొంటాడు.

భగవద్గీతలో ఇలా ఉన్నది :

**సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి।**
**అజానతా మహిమానం తవేదం మయా ప్రమదా త్ప్రణయేన వాపి॥**
**యచ్చాపహాసార్థ మసత్కృతోఽసి విహారశయ్యాసన భోజనేషు।**
**ఏకోఽథవాప్యచ్యుత త్వత్సమక్షం తత్ క్షామయే త్వామహ మప్రమేయమ్ ॥**

(నీ మహిమను తెలియక పొరపాటున లేదా స్నేహంతో ఓ కృష్ణా! ఓ యాదవా! ఓ సఖుడా! అని యిష్టము వచ్చినట్లు పిలుచుచుంటిని. విహారశయనాసన భజనాదులయందు, ఒంటరిగా నున్నప్పుడు నలుగురిలో నేను గౌరవించకపోయి నందుకు నన్ను క్షమింపవలసినదిగా అప్రమేయుడవైన నిన్ను ప్రార్థించుచున్నాను.)

కాబట్టి పెద్దవారితో వ్యవహరించునప్పుడు జాగ్రత్తగా యుండవలెను. ●

ఒక ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ ఒక తాతయ్య మనవడు నివసిస్తున్నారు. రోజు ప్రొద్దునే తాతయ్య భగవద్గీత చదువుకుంటూ ఉండేవాడు. అది చూసి మనవడు కూడా తాతయ్యని అనుసరించి భగవద్గీతని చదవటం మొదలుపెట్టాడు. ఎంత చదివినా కొంచెం కూడా అర్థం కావటం లేదు అని, అదే సంగతి ఒక రోజు తాత బొగ్గుల కుంపటిలో వంట చేస్తుండగా అడిగాడు. చదివిన నాకు ఏమి గుర్తు ఉండట్లేదు. అసలు చదవటం వలన మంచి ఏమిటి అని. దానికి తాత నవ్వి పక్కనే ఉన్న బొగ్గుల బుట్టని ఇచ్చి పక్కన పారే ఏటి నుంచి బుట్ట నిండా నీళ్ళు పట్టుకురా అని చెప్పాడు. మనవడు అలానే బుట్ట నిండా నీళ్ళ తీసుకుని తాత దగ్గరకు వచ్చేసరికి అవన్నీ కారిపోయాయి. మనవడు బిక్క మొహం చూసి, తాత నవ్వి మరింత వేగంగా వస్తే నీళ్ళు ఉండేవి అని మళ్ళీ ప్రయత్నించమన్నాడు. ఈ సారి మనవడు చాలా వేగంగా తెచ్చాడు కానీ బుట్టలో నీళ్ళు లేవు. అలా చాలా సార్లు ప్రయత్నించాక మనవడు బుట్టలో నీళ్ళ తేవటం అసాధ్యం, ప్రయత్నించడటం కూడా నిరుపయోగం అన్నాడు. అపుడు తాత నువ్వు చేసిన పని నిరుపయోగం కాలేదు. ఒకసారి బొగ్గుల బుట్ట చూడు అన్నాడు. మనవడు బొగ్గుల బుట్టని చూసి ఆశ్చర్యపోయాడు. బొగ్గులతో నల్లగా దుమ్ముకొట్టుకుపోయి ఉన్న బుట్ట ఇప్పుడు శుభ్రంగా మెరిసిపోతోంది. అర్థం కాకపోయినా గీత చదువుతుంటే ఈ బుట్టలాగే నీ మనసు కూడా పరిశుభ్రంగా అవుతుంది అన్నాడు. అర్థమైతే అంత కన్నా అదృష్టమే లేదు. అని తాత అర్థం కాకపోయినా గీత చదవటం వలన ఉపయోగం వివరించాడు.





# ప్రజాస్వామ్యానికి పార్లమెంటు దేవాలయం

**పార్లమెంటు ప్రాంగణ మెట్లకు మోకరిల్లి వందనం చేస్తున్న మోడి!**

ప్రధాని నరేంద్రమోడి ఇంద్రప్రస్థంలోని పార్లమెంటు భవనంలోకి ప్రవేశించే మెట్లకు శిరమూ, శరీరములోని చేతులూ పాదాలను వంచి మోకరిల్లి వందనం చేసారు. ప్రజాస్వామ్య విలువల్ని పాటించడం కోసం పార్లమెంటు సభ్యులు రాష్ట్ర అసెంబ్లీ సభ్యులూ మార్గదర్శక సూత్రాల్ని పాటించాలి.

మొన్నమొన్న మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంలో ఆ రాష్ట్ర గవర్నరు పట్ల సభ్యులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని పరిహసించినట్లయింది. ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంలో ఆనాటి పార్లమెంటు అధినేతలు, పార్లమెంటు సభ్యులూ తలుపుల్ని మూసి తన్నుకున్న విధానం పునరావృతమైందా అనిపిస్తుంది. ప్రజలు విశ్వాసముంచి ఎన్నుకోబడిన సభ్యులు, ప్రజాసమస్యల కోసం పరితపించకుండా, ద్వేష సహిత ప్రతాపములు చూపడం గర్హించదగిన విషయం. దేశప్రజల్లోనే గాకుండా ప్రపంచ ప్రజల్లో చులకనైపోతామని గ్రహించాలి.

భారతప్రజాస్వామ్యంపై ఏ విధంగా దాడి చేద్దామా యని పొంచి ఉన్నవారికి దారి కల్పించినట్లవుతుంది. ముందెపుడూ ఇలాటి సంఘటన పునరావృతం కారాదు.

పార్లమెంట్ సెంట్రల్‌హాలులో జరిగిన భారతీయ జనతాపార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో శ్రీ నరేంద్రమోడి పార్లమెంట్ పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయి పార్లమెంట్ భవన్‌లో అడుగుపెడుతూనే పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణిస్తూ వంగి, శిరస్సును మెట్లకు తాకించి విధేయంగా నమస్కరించారు.

నేను మొదటిసారి పార్లమెంట్ సెంట్రల్‌హాలులో అడుగుపెట్టాను. బహుశ నా జీవితంలో ప్రతీసారీ ఇలాగే జరుగుతోందనకుకుంటా. నాడు ముఖ్యమంత్రి అయిన తర్వాతే విధానసభ చూశాను. ఈ రోజు ప్రధానిగా పార్లమెంటులో అడుగు పెడుతున్నాను.

మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం. మన రాజ్యాంగ నిర్మాతలు ఇచ్చిన శక్తి, ఒక పేదకుటుంబానికి చెందిన వ్యక్తిని ఈ రోజు ఇక్కడ నిలబడేట్టు చేసింది. ఇది మనదేశానికి గల ప్రజాస్వామ్య శక్తి.

మనం కూర్చున్న ఈ చోటు ప్రజాస్వామ్య దేవాలయం. మనం ఈ మందిరంలో కూర్చొని పదవి కోసం కాకుండా, పూర్తి పవిత్రతో 125 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలు తీర్చటం కోసం శ్రమించాలి.

స్వాతంత్ర్యానంతరం పుట్టినవారందరికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసే భాగ్యం కలుగలేదు. యవ్వనమంతా జైళ్లల్లో మగ్గే అదృష్టమూ లేదు. దేశం కోసం సంఘర్షణ చేయలేదు. దేశం కోసం జీవించే అవకాశాన్ని కోటానుకోట్ల మంది ప్రజలు మనకు కల్పించారు. మనమంతా దేశం కోసం జీవించాలన్న సంకల్పంతో ముందడుగు వేయాలి. మోకరిల్లి వందనం చేయాలి.

ఇప్పటివరకు జరిగిన మంచిలో అన్ని ప్రభుత్వాల పాత్ర ఉంది. వాటికి నేతృత్వం వహించిన భాగస్వామ్యమూ ఉంది. అందులోని మంచినే మనం గ్రహించాలి. ఎక్కువ మంచి చేయడానికి ప్రయత్నించాలి.

ఈ ప్రభుత్వం పేదలకు కోటానుకోట్ల యువకులకు సమర్పితం. గౌరవాభిమానాల కోసం ఎదురుచూస్తున్న తల్లీచెల్లెళ్లకు సమర్పితం. ఏదో ఒకటి మంచి చేయాలనే సంకల్పబలం ఉన్నవారికోసం సమర్పితం.

గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదని నేను అనుకోను. స్వాతంత్ర్యానంతరం వచ్చిన ప్రభుత్వాలన్నీ తమదైన శైలిలో దేశానికి సేవచేయటానికి ప్రయత్నించాయి. దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళటానికి తమవంతు కృషి చేశాయి.

నిరాశాభావం కూడదు. ఆశావాదిగా ఉండడం చాలా అవసరం. నేను చాలా ఆశావాదిని. కష్టాలూ వస్తూంటాయి. జీవితంలో ఎవరికి కష్టం రాదు? 125 కోట్లమంది ఒక్క అడుగు ముందుకు వేస్తే దేశం 125 అడుగులు ముందుకు వెళ్తుంది. నేను జన్మతః ఆశావాదిని. అణువణువునా ఆశావాదం నిండిన వ్యక్తిని. అది నా డి.ఎన్.ఏ.లో వుంది. నిరాశావాదం అంటే ఎలా వుంటుందో కూడా నాకు తెలియదు. ఒక్క ఆశావాది మాత్రమే ఇతరులలో స్ఫూర్తి, ఉత్సాహం నింపగలడు.

దేశంలోని ప్రతి ఒక్కరిని, ప్రతివర్గాన్ని, అభివృద్ధి పథాన తీసుకువెళ్లటమే నా లక్ష్యం. 'అందరితో వికాసం కోసం' పనిచేద్దాం అని ప్రతిజ్ఞ చేశారు మోడీ. ●


**Hotel Southern** - New Delhi

**Southern Grand** - Vijayawada







**Hotel Southern at New Delhi** - Is the Largest South Indian Hotel, equipped with 110 rooms with modern amenities, conference hall, with a Vijayawada Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.
The Hotel is centrally located 2.5 kms from New Delhi Railway Station and 15 kms from Domestic / International Airport.

**Hotel Southern Grand at Vijayawada** - It is a recently opened hotel with 3 star kind of modern amenities and equipped with a total of 37 rooms, conference hall and a Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.
The Hotel is centrally located 0.5 km from Vijayawada Railway Station and 19 kms from Domestic Airport.

Complimentary : **Breakfast & Transport from Rly. Station / Airport to our Hotel, subject to prior information to our offices**
■ Bring Your Boarding Pass of Air India Airlines & Avail 10% discount on Room Tariff only

HOTEL SOUTHERN™
style. comfort. enjoy.


18/2, Arya Samaj Road,
Karol Bagh, **New Delhi.**
Tel.: 4353 2824, 2875 4210,
Fax: 011-2875 7308
e-mail: info@hotelsouthern.com
**Reservations:** Call 011- 4145 0200

26-6-8, Papaiah Street, Opp. Registrar's Office
Gandhi Nagar, **Vijayawada,** Andhra Pradesh
Tel.: 66 77 777, 66 55 777,
Fax: 0866-257 2227
e-mail: bza@hotelsouthern.com




Theater Style Upto 100 Persons

# సవ్యసాచి వెంకయ్యనాయుడు



అనర్గళంగా మాట్లాడగల శక్తి ఉన్న నాయకుడు, ఉపమాన ఉపమేయాలతో ఫుల్‌స్టాపు, కామాలు లేకుండా మాట్లాడగల శక్తిమంతుడు. గతంలో వాజ్‌పేయి మంత్రివర్గంలోనూ, ప్రస్తుత మోడీ మంత్రవర్గంలోనూ అసాధారణ వాగ్విభవశాలి, సమస్యలను ఆకళింపు చేసుకుని, ప్రత్యర్థులను చిత్తుచేయడంలో ప్రవీణుడు. ఆ ధోవతీ, పంచెకట్టూ, ఆ తెల్లచొక్కాలను బట్టి ఆంధ్రుడనే ఆహార్య సొంపులున్నా, ఏ భాషా రాష్ట్రం వెళ్ళినపుడు, ఆ భాషా రాష్ట్రం అధికార భాషలోనే మాట్లాడి, వారిని తమవైపు త్రిప్పుకోగల సామర్థ్యం ఉన్న నాయకుడు.

ఎస్వీ రంగారావు వంటి స్ఫురద్రూపి, ముఖ కవళిక ఒకరకంగా రంగారావు వలెనే ఉంటుంది.

భారతీయజనతా పార్టీ, ఆంధ్రదేశంలో ప్రాచుర్యం పొందడానికి వెంకయ్యానాయుడి వాగ్ధాటికూడా ఉపయోగపడింది.

తెలుగు రాష్ట్రాలు రెండుగా విడిపోయినప్పటికినీ, రెండు రాష్ట్రాలనూ భారతదేశచిత్రపటంలో చూపించాలనెడి తపన ఉన్నది. వాగ్ధాటీ, వాక్సౌరభములతోబాటు వాత్సల్య భావనలున్నవాడు. పార్టీ అధికారంలో లేనపుడు కూడా వెంకయ్యనాయుడు ప్రతిభ తగ్గలేదు. అది ఆయన పొట్టిశ్రీరాములు (నెల్లూరు) జిల్లాలోని పినాకినీ ప్రాభవం కావచ్చు. తిక్కనాది కవివరేణ్యులు పుట్టిన నేల ప్రతిభ కావచ్చు.

ఎప్పుడు కలిసినా, ఎక్కడ కలిసినా కొంచెం సేపు కుశలములడిగే మనఃస్తత్వం ఉన్నది. బహుశః అది మనవాడూ, పరాయివాడూ అనే భావం లేకపోవడం వలన కావచ్చు. దీర్ఘాయుష్మంతునిగా, ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఓ శ్రేయోభిలాషిగా వేంకట రమణుని ప్రార్థిస్తున్నాను. ●

# విశ్వంలో హృదయ వైశాల్యం కలవాడే అజేయుడు!

-కె. మల్లికార్జున, బళ్ళారి

గోరంత దీపం ఇంటి మొత్తానికి వెలుగునిస్తుందని మనందరికీ తెలుసు. అదేవిధంగా గోరంత మంచి మనసు మనిషిని ఉన్నతుణ్ణి చేయడమే గాక చుట్టూ ఉన్న సమాజాన్ని అద్భుతంగా ప్రభావితం చేయగలదు. ఆత్మలో వెలుగుంటే మనిషిలో సౌందర్యం, అందం, ఆనందం ఉంటాయి. కాబట్టి అతని కుటుంబంలో సభ్యులంతా ఎంతో సంతోషంగా ఉంటారు. ఇల్లు ప్రశాంతంగా ఉంటే గ్రామం, రాష్ట్రం, దేశం, విశ్వం సుఖశాంతులతో విరాజిల్లుతుంది. దీనికంతటికి ప్రధాన కారణం మానవుని హృదయవైశాల్యమే. 'హృదయవైశాల్యం' అంటే మనిషి మనసులో క్షమ, సహనం, శ్రద్ధ, పరోపకారం, ప్రేమ, అహింస వంటి సద్గుణాలకు చోటు ఉండటమే.

మనిషి జీవితంలో సుఖదుఃఖాలు, లాభనష్టాలు, కలిమిలేములు, చీకటివెలుగులు సహజంగానే వస్తూపోతూంటాయి. వీటికి చలించకుండా అన్నిటియందు సమబుద్ధి కలిగి, లభ్యమైన దానిని స్వీకరించే మంచి మనసును అలవరచుకోవాలి. కొన్ని సందర్భాలలో మనిషి తనకు తెలియకుండా పొరపాట్లు చేస్తూంటాడు. అది మానవ సహజం. ఆ పొరపాట్లు తెలుసుకొని, సరిదిద్దుకొని భవిష్యత్తులో ఆ తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవడమే విజ్ఞుల లక్ష్యం.

ఎదుటి వ్యక్తిలోని లోపాలను, దోషాలను పదేపదే ఎత్తిచూపి, వాటిని విమర్శించి, దూషించి, వాళ్ళను క్షోభపెట్టకుండా, వారిని మన్నించి ప్రేమతో అక్కున చేర్చుకునే మనస్తత్వమే హృదయవైశాల్యం. ఈ హృదయ సంస్కార సందేశాన్ని సమాజానికి వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఋషులు, యోగులు తెలియజేశారు.

ప్రకృతి ప్రతి ఒక్కటి సమాజానికి, మనిషి జీవనోపాధికి సమకూర్చుతుంది. కానీ ప్రకృతి ఏదీ ఆశించదు. చెట్టు మనకు పూలు, ఫలాలు, నీడ ఇస్తుంది. అటువంటి చెట్టును నరికినా మనకు కలపను ఇస్తుంది. కాల్చితే బొగ్గును ఇస్తుంది. ఆ చెట్టుకు ప్రాణం ఉన్నది. అయినా ఆ చెట్టు మన నుంచీ ఏదీ ఆశించదు. ఆ చెట్టుకున్న హృదయవైశాల్యం మానవునికి ఉంటే ఈ సమాజంలో ఇన్ని అనర్థాలు, ఘోరాలు, అత్యాచారాలు, మానభంగాలు, హత్యలు జరుగుతాయి? నిజం చెప్పాలంటే ఇవి జరుగవు. త్రికరణశుద్ధిగా హృదయాన్ని భద్రపరచుకోగలిగితే సాధించలేని కార్యముంటుందా? చెట్టు ఆకాశంవైపు ఎంత పైకెదిగినా తానుపుట్టిన మట్టిని మరువదు! కానీ మనిషి ఎదిగేకొద్దీ తనచుట్టూ వున్న సమాజాన్ని మరచిపోతాడు. కాబట్టి తాను పుట్టిపెరిగిన నేలను విస్మరించకూడదు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తన చుట్టూ వున్న వాళ్ళను మరువకూడదు.

శ్రీరామచంద్రుడు మరుసటి రోజు జరిగే పట్టాభిషేకానికి పొంగిపోలేదు. తెల్లవారగానే తాను అడవులకు వెళ్లవలసి వస్తుందని కుంగిపోలేదు. దుశ్శాసుని దుశ్చర్య, కర్ణుడి పరుషపదాలు, దుర్యోధనుడి అహంకారపూరిత వచనాలు, కీచకుడి అత్యాచార యత్నం వంటి అవమానాలు భరించిన ద్రౌపది ఎంత ఆత్మస్థైర్యం కనబరచింది. చివరికి విజయాన్నే పొందింది కదా! సుఖదుఃఖాలను సమానంగా భావించి స్వీకరించేవాడే నాకు అత్యంత ప్రియమైన భక్తుడు అన్నాడు గీతాచార్యుడు.

అపజయాలు విజయాలకు సోపానాలు అని పెద్దలు ఎప్పుడో చెప్పారు. అప జయంలో ఆదుకునేది ఆధ్యాత్మిక చింతన ఒక్కటే. అది ఆత్మ స్థైర్యాన్ని ప్రసాదిస్తుంది. మనసుకు క్షమాగుణాన్ని, సహనాన్ని నేర్పుతుంది. అందుకు ప్రహ్లాదుడి చరిత్ర, రామదాసు చరిత్రలు తార్కాణములు. ఎన్ని అవమానాలు ఎదురైనా మీరాబాయి కృష్ణభక్తిని మానుకోలేదు. ఎట్టి విపత్కర పరిస్థితులు ఎదురైనా మహర్షులు తమ కఠోర దీక్షలను, తపస్సును విరమించుకోలేరు. అంతటి విశాల హృదయవైశాల్యం గలవారు మహోత్కృష్టమైన జ్ఞాన సంపదను పొందగలిగినారు. హృదయవైశాల్యం గలవారు శత్రువులను, దోషులను క్షమిస్తారు.

ఒకరోజు ఓ సన్యాసి భిక్షకోసం ఓ ఇంటి ముందు నిలుచుకొని 'భవతీ భిక్షాందేహి' అని కేకవేశాడు. ఇంటిలోపలి నుంచి ఇల్లాలు ఆగ్రహంతో బైటికొచ్చి భిక్షం వెయ్యక పోగా ఆ సన్యాసిని నోటికొచ్చినట్లు దూషించింది. ఆ దూషణలన్నీ విన్న సన్యాసి కోపగించుకోక ప్రశాంతంగా వెనుదిరిగాడు. అది చూచి ఆశ్చర్యపోయింది ఆశ్చర్యంగా ఆమె ఆ సన్యాసితో 'నా మాటలు విని నీకు కోపం రాలేదా?' అని ప్రశ్నించింది.

అందుకు ఆ సన్యాసి చిరునవ్వుతో ఆమెతో ఇలా అన్నాడు : 'ఎందుకు తల్లీ నీ మీద నాకు కోపం. ఈ శరీరం నాదే అనుకుంటే నాకు కోపం వస్తుంది. ఈ శరీరం నాదికానప్పుడు నీ మీద కోపం ఎందుకొస్తుంది. ఈ చేతిలోని కమండలాన్ని తిడితే ఎంతో, నా శరీరాన్ని తిట్టినా అంతే! నా మనసు అవేమీ పట్టించుకోదు' అంటూ ప్రశాంతంగా వెళ్ళిపోయాడు ఆ సన్యాసి. అంటే సన్యాసికి విశాలహృదయం ఉంది కాబట్టి, ఆ ఇల్లాలిని ఏమీఅనలేక ఆమెను క్షమించి వెళ్ళిపోయాడు.

మనకు లేనివి ఇతరుల దగ్గరుంటే మన మనసులో ఈర్ష్య, పగ పెరుగుతాయి. హృదయవైశాల్యానికి దుష్టభావన ప్రేరణ కలిగించినా అది చలించదు. ఆహార విషయంలో పేదవారిని దృష్టిలో పెట్టుకోవాలి. ఆచరణ విషయంలో పెద్దవారిని ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడే 'ఓర్పు' అనే సద్గుణము మనసుకు కలుగుతుంది. హృదయవైశాల్యానికి నాంది పలుకుతుంది. ఈ సద్గుణాన్ని అలవరచుకున్నవాడిని ఏ విపత్తు, ఏ అనర్థమూ ప్రభావితం చేయదు. కాబట్టి విశ్వంలో హృదయవైశాల్యం కలవాడే అజేయుడు, అభినందనీయుడు అని జ్ఞానులు పేర్కొన్నారు. ●

# పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిపెట్టినవాడు

# డా॥ ఎన్. గోపి



గోపి అనేది రెండక్షరాల పేరే! రెండు శతాబ్దముల కృషీ సంపన్నతను రెండు దశాబ్దాల్లోనే ఆయన ప్రతిబింబింపచేసారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఖ్యాతిని జగద్విఖాతమొనర్చిందీ ఆచార్య గోపీయని చెప్పడంలో అవగింజంత అతిశయోక్తి లేదు. ఎన్ని ఉన్నత పదవులధిష్ఠించినా కించిత్తు అహంకారం కూడా మమకార పూర్వకంగానైనా ఆయన్నంటలేదు.

గోపిలో ఓ మంచివాడున్నాడు. మంచి విద్యావంతుడున్నాడు. మంచి విజ్ఞాన శీలుడున్నాడు. మంచి వివేకవంతుడున్నాడు. వీటన్నిటికీ మించిన వినయశీలత్వం ఉన్నది. ఈ సర్వలక్షణ సంపద ఏ కొద్ది మందిలో గానీ కనిపించదు. చిరాకులేకుండా చిరునవ్వులతో జవాబు చెప్పే చతురత గోపీలో ఉందని హోసూరు సభల్లో తెలుసు కున్నాను. వనరుల వసతి పరిమితంగా ఉన్నా విశ్వవిద్యాలయాన్ని విమలీకృతంగా అభివృద్ధిపరచవచ్చునని ఆయన పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా నిరూపించారు. ఆయన వైస్‌ఛాన్సలర్‌గా, టి. గౌరిశంకర్ రిజిస్ట్రార్‌గా దేశంలోని అనేక ప్రాంతాలూ, విదేశాలూ పర్యటించి తెలుగుభాష ఉనికికి పట్టం గట్టారు.

గోపీలో పట్టుదల యెక్కువ; అది పరిధుల్ని దాటి పరుగెత్తదు. పరుగెత్తినా పయనంలో అలసట చెందదు. కాని తెలుగుభాషలో ఉన్న 56 అక్షరాలూ అలసట చెందాయేమో అనిపిస్తుంది. మూడున్నర దశాబ్దాలు ఉస్మాన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, డీన్‌గా పనిచేశారు. 42 గ్రంథాలు రచించారు. అన్ని గ్రంథాలూ వివిధ విజ్ఞాన సూచికలే! వాటిలో కవితాపటిమగల గ్రంథాలున్నాయ్. విమర్శనా వ్యాస సంపుటాలున్నాయ్. పరిశోధనాత్మక గ్రంథాలున్నాయ్, వ్యాఖ్యానగ్రంథా లున్నాయ్. యాత్రా చరిత్రలున్నాయ్. అనువాద గ్రంథాలున్నాయ్. శీర్షికా ధారా వాహికలున్నాయ్. నానీలున్నాయ్, పాఠ్యగ్రంథాలున్నాయ్, వయోజన విద్యాగ్రంథా లున్నాయ్. వేమన వివిధ సమాజ జీవితాలపై పద్యాలను వ్రాస్తే – వాటి మూలసిద్ధాంతాన్ని వెదికిపట్టుకుని వ్రాసిన బృహద్గ్రంథం 'ప్రజాకవి వేమన'లో గోపి ప్రజాకవి అనిపించుకున్నారు. కాలాన్ని నిద్రపోనివ్వను! కవితా సంపుటిలో సాహిత్యాన్ని నిదురపోనివ్వని అవిశ్రాంత అక్షర యజ్ఞ యాజి 'గోపి'.

యాభైఆరు సంవత్సరాల క్రితం 1948 సంవత్సరం జూన్ 25వ తేదీన తెలంగాణా నల్గొండ జిల్లాలోని భువనగిరిలో పుట్టిన గోపి యాభైయారు హ్రస్వదీర్ఘాక్షర గుణీకరణతో గుణ సాహిత్య గుణ సంపన్నుడైనప్పటికీనీ ఆ సాహితీ బృందావన గోపిగా తనొక శకానికి (గ్రంథ)కర్త కావడం మాకెంతో ఆనందంగా ఉన్నది.

వీరి 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితా సంపుటి హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ, నేపాలి, తమిళం, మలయాళం, మరాఠీ, కొంకణి, డోగ్రి, మైథిలీ, కన్నడం, పంజాబీ, సంస్కృతం, ఒడియా, సింధీ, మణిపురి వంటి భారతీయ భాషలలోకి అనువదింప బడింది. తెలుగు నుంచి ఇన్ని ఇతర భాషల్లోకి అనువదింపబడిన కవితలు, కవి మరొకరు లేరు. కాలాన్ని నిద్రపోనివ్వను కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అనన్తరం దేవులపల్లి కృష్ణశాస్త్రి అవార్డు, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ కవితా పురస్కారం, సినారె కవితా పురస్కారం, శ్రీమతి లక్ష్మీరమణ తెలుగు విశ్వవిద్యాలయ ధర్మనిధి పురస్కారం, అమలాపురం వారి సరసం అవార్డు, విజయనగరం విజయభావన పురస్కారం, అరుంధతి కళాసమితి హైదరాబాద్‌వారి డా॥ దాశరథి పురస్కారం, కురుగంటి సీతారామయ్యగారి అవార్డు, జోత్స్నా కళాపీఠం 'సుగుణమణి సాహిత్యపురస్కారం', సాహితీరత్న నీలా జంగయ్య సాహిత్య పురస్కారం, తణుకువారి బాలగంగాధర తిలక్ కవితా పురస్కారం, పాలకొల్లు లోని వారి సినారె సాహితీ పురస్కారం, రాజమండ్రివారి ప్రతిభా వైజయంతిక, ఆం.ప్ర. సాంస్కృతిక శాఖ ఉగాది విశిష్ట పురస్కారం. కళారత్న అవార్డు, పీఠాపురం వారి మాతృశ్రీ రాజహంస కృష్ణశాస్త్రి అవార్డు, దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, ఆం.ప్ర. ప్రభుత్వం బోయిభీమన్న పురస్కారం, కరుణశ్రీ, జంధ్యాల పాపయ్య శాస్త్రి సాహితీ పురస్కారం వంశీ విజ్ఞానపీఠం, అమెరికా చికాగోలోని శ్రీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆఫ్ నార్త్ అమెరికా వారు అందజేసిన పురస్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్టు తరఫున శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డు, శ్రీపాదరావు స్మృతి పురస్కారం లెక్కవేసుకుని, దామాషావేసి చూచుకుంటుంటే సంవత్సరానికో పురస్కారం లెక్కకు వస్తుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో బంగారుపతకంతో పాటు బి.ఏ. పట్టా తెలుగు భాషా సాహిత్యాలలో ఎం.ఎ. పూర్తి చేసి ఉస్మానియా నుండే ఉన్నతోన్నతశ్రేణికి మరో స్వర్ణపతకం సాధించారు. భాషాశాస్త్రంలో పి.జి. డిప్లొమా కూడా చేశారు. దేశచరిత్రలో ఓ పిన్న వయస్కుడు విశ్వవిద్యాలయపు వైస్‌ఛాన్సలరైన వైనం లేదు, నా నయనాలు కనలేదు.

నానీల త్రివిక్రముడు, నానీల నాన్న, కవితాప్రపూర్ణ, అభినవ వేమన వంటి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బిరుదములను ఆంధ్రప్రదేశ్ నలుమూలల పట్టణాల్నుంచీ అందుకోవడం నాలుగుదెసలవారు జేజేలు పలికారు. ఈ సాహితీ ఉద్యానవనునికి ప్రముఖాంధ్ర జేజేలు పలుకుతూంది. ●


రాబడిని పెంచే లక్ష్మీ స్వరూపమైన

ధర రూ. 400/- మాత్రమే **లక్ష్మీ గవ్వలు** Lakshmi Gavvalu



లక్ష్మీ గవ్వలు లక్ష్మీ స్వరూపం. ఇందులో లక్ష్మీదేవి నివాసమై ఉంటుందని పురాణాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఓ తెల్లని వస్త్రానికి పసుపు పూసి అందులో ఈ లక్ష్మీ గవ్వలను మూటగట్టి ఇంట్లో పెట్టుకుని పూజిస్తే కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగి ఒకరికొకరు సహాయ సహకారాన్ని అందించుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతారు. రాబడి పెరుగుతుంది. అనారోగ్యం తొలగుతుంది. వ్యాపార స్థలంలో పెట్టుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. పనివాళ్ళు నుండి మీకు ఎటువంటి ఒత్తిళ్ళుండవు. మీరు కోరిన విధంగా మీపై గౌరవ మర్యాదలతో పనిచేస్తారు. ఉద్యోగస్తులు జేబులో పెట్టుకుంటే తోటి ఉద్యోగస్తులనుండి సమస్యలు రావు. ఈ గవ్వలను తాకి ఏ పని మొదలెట్టినా అది విజయవంతమౌతుంది.

డా॥ మల్లంపల్లి రామలింగ శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

Estd. 1975

: 09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
T&C Apply
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra



# బుగ్గమీసాలూ, పాంటూ, షర్టూ! ధీమాగా నడిచే భువనచంద్ర!

కొలుత ఆయన్ను చూచి మిలట్రీవాడనుకున్నాను. రచయిత భువనచంద్ర! భువనమోహనంగానే ఉంటాడు. కానీ ఆ రెండు మీసాలూ మిలట్రీవానికో, పోలీసు వానికో గానీ( ఉండవు. ఆయన నవ్వులు మీసాలకు పోటీపడుతుంటాయ్

నేను వేదిక యెక్కిన వేదికలో ఆయనగానీ, ఆయన వేదిక నధిరోహించిన సభలోగానీ కూర్చుంటూ ఉంటాను. నా శిరోజాలు తెల్లబడినందుకు నాకు కలిగిన అర్హత. భువనచంద్ర రాని సాహితీసభలు అరుదుగానే ఉంటాయ్. భువనచంద్రుడు కదా, చిరునవ్వు చంద్రికల్ని అందరి మీదా రువ్వుతూనే ఉంటారు. నేను కనిపిస్తే చటాల్ను నవ్వి, మాటల్లోకి వెళ్ళిపోతారు! నేను మీ 'ఆధ్యాత్మ రామాయణం' గ్రంథమ్మీద రాద్దామనుకుంటున్నాను – అంటారు. ఎప్పుడు కలిసినా అదేమాట– ఈ మాటను తు.చ. తప్పకుండా పాటిస్తారు.

భువనచంద్రను మాటమార్చే మనిషి కాదని వక్కాణించి చెబుతున్నాను.

ఆయన మాటలు వాడకుండా సినిమాల్లో పాటలు వ్రాస్తూ, వాడని మావి చిగురులా వర్థిల్లుతున్నారు. సినిమా నిర్మాణ శకటం రెండు కాళ్ళను చెన్నయ్‌లోను, రెండు కాళ్ళను హైదరాబాద్‌లోను పెట్టింది. భువనచంద్ర అలా కాదు, రెండు కాళ్ళను చెన్నయ్‌లో నిలుపుకుంటూనే హైదరాబాదులో రెండు కాళ్ళూనించుకుని నిలుచుంటున్నారు.

అందుచేత మెరుపూ మేఘంలా ఏ సమయాన ఎక్కడుంటారో ఆయనకు తెలియదు. ఆయన రాయాలన్న పాట వచ్చినప్పుడు– ఆయనే మద్రాసులో ప్రత్యక్షమవుతారు. అలా వ్రాసిన ఓ పాట 'చంద్రముఖి' చిత్రంలోని – 'రా!రా! చెంతకు రారా' అనే పాట యిప్పటికీ సూపర్‌డూపర్‌హిట్టుగా వినిపిస్తూంటుంది. ఆ ఒక్కపాట చాలు– నా ఒంటినీ, కంటినీ, ఇంటినీ, వీనద్వయాన్ని కట్టిపెట్టి నట్లుంటుంది. అందుకే 'భువనచంద్ర' కనపడ్డప్పుడల్లా కనుల మెరిసే ఆనందాన్ని పంచుకుంటూ ఉంటాను. ఇంత స్తుతి చేయకపోతే భువనచంద్రుణ్ణెరుగనను కుంటారు. ఆయన యెప్పుడో, యేదో పత్రికలో–ఆయన చెప్పిన మాటల్నే పొందుపరుస్తున్నాను.

1971 ఇండో–పాక్ యుద్ధం. అందులో నేనూ పనిచేశాను. సరిహద్దు గ్రామాల్లోంచి వెళ్తూంటే ప్రజలు రొట్టెలు ఇచ్చేవారు. మీకెందుకీ శ్రమ అంటే... 'ఆప్ హమారే భాయీ హై' అనేవారు. యుద్ధం ముగిసింది. తిరిగి వస్తుంటే... దారి పొడవునా సెల్యూట్‌లు, పంజాబీ, గుజరాతీ స్త్రీలు చేతులకు రాఖీలు కట్టారు. 'జీతేరహో' అని దీవిస్తుంటే... ఎంతో గర్వంగా ఉండేది. కళ్ళు నీళ్లతో నిండేవి. అది చాలదా ఈ జీవితానికి! నేను భారతీయుడినైనందుకు ఎప్పటికీ గర్వపడతా. ఎయిర్‌ఫోర్స్‌లో ఉండగానే చిన్నచిన్న వ్యాసాలూ కథలూ రాసి వివిధ పత్రికలకు పంపడం అలవాటు. ఉద్యోగం చేస్తున్నన్నాళ్లూ పుస్తక పఠనం వదల్లే. సర్వీసులో ఉండగా దాదాపు 4 వేల పాటలు రాశాను. అవి అద్భుతమైనవి కావొచ్చు. కాకపోవచ్చు. కానీ అవి సినిమాలకి పనికిరావని తర్వాత తెలిసింది.

ఎయిర్‌ఫోర్స్‌లో 18 ఏళ్ళ సర్వీసు పూర్తయింది. 12 వేల జీతంతో ఓఎన్జీసిలో ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. చేతిలో అపాయింట్ ఆర్డర్ పట్టుకున్నా. చిన్నప్పుడు వాల్‌పోస్టర్‌ల మీద పేరు రాసుకున్న రోజులు గుర్తుకొచ్చాయి. బతికేది ఒక్కసారే... ట్రైచేద్దాం. అనుకుని మద్రాసు బయలుదేరా.

చంద్రమోహన్‌గారు మొదట నన్ను జంధ్యాలగారి ఇంటికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన 'పడమటి సంధ్యారాగం' తీస్తున్నారు. ఆ తరువాత అవకాశం ఇస్తామన్నారు. కానీ దురదృష్టం. ఆయన సినిమాల్లో ఒక్కపాటా రాయలేకపోయాను. తరువాత విజయ్‌బాపినీడుగారిని కలిశాను. 'ఇక్కడ స్థిరపడాలంటే చాలా కష్టపడాలి. ఆ ఉద్యోగమేదో చేసుకో' అన్నారు. ఆ కష్టమేదో పడతాను సార్ అన్నాను. 'అయితే ఓ కండిషన్.. 'ఆన్‌పావమ్' అనే సినిమాను తెలుగులో తీస్తున్నాం. దానికి టైటిల్ సాంగ్ కావాలి. నువ్వా సినిమా చూసి పాట రాయడానికి ప్రయత్నించు. అది నచ్చితేనే నువ్వు ఇక్కడుంటావ్. లేకుంటే మద్రాసు వదలివెళ్లిపోవాలి' అని ఒట్టేయించుకున్నారు. ఆ సినిమా చూశా. పాట రాసుకొచ్చి బాపినీడుగారికి వినిపించా. ఆయనకి నచ్చేసింది. 'నువ్వు సినీ రంగంలోనే ఉండు' అన్నారాయన.'నాకూ పెళ్లాం కావాలి' చిత్రం ద్వారా తెరపై నా పేరు తొలిసారిగా పడింది. అది సూపర్‌హిట్. తరువాత బాపినీడుగారు ఓ మాటన్నారు... 'నీచేత పాటలు రాయించమని నేను ఎవ్వరికీ రికమండ్ చేయను. నువ్వూ ఎవర్నీ పాట ఇమ్మని అడగొద్దు' అని. అలాగే ఆయన సినిమాలన్నింటిలోనూ నాకు అవకాశం ఇచ్చారు. ఖైదీ నెం786లో 'గువ్వా గోరింక..' రచయితగా పేరు తెచ్చిన పాట. ఆ తరువాత 'గ్యాంగ్‌లీడర్', 'ఘరానామొగుడు', 'పెద్దరికం'... వరుసహిట్లూ అవకాశాలు. 'గ్యాంగ్‌లీడర్' పాటలు రాస్తున్నప్పుడు మా అమ్మ చనిపోయింది. విషయం తెలియగానే వెళ్లాను. ఆ మర్నాడే బప్పిలహరిగారితో మ్యూజిక్ సిట్టింగ్స్. బాధపడుతూ కూర్చునే కంటే అమ్మ స్ఫూర్తితో పాటలు రాయాలని నిర్ణయించుకున్నా. ఐదు పాటల్ని ట్రైన్‌లో వెళ్తూనే రాసేశా. ఈ మధ్య తమిళ 'చంద్రముఖి'లో 'రారా... సరసకు రారా' పాట తమిళనాడులో సూపర్‌హిట్ అయింది. తెలుగురానివాళ్ళు సైతం ఆ పాట పాడుకోవటం ఎంతో  ఆనందం కలిగించింది. ఇష్టమైన పాటలు...కష్టమైన పాటలు... ఇంకా ఎన్నో కెరీర్‌లో.

ఇక నా కుటుంబ విషయానికొస్తే నా భార్య శేషసామ్రాజ్య లక్ష్మి, కొడుకు శ్రీనివాస్. ప్రస్తుతం చెన్నైలోనే ఉంటున్నాం. మా అన్నయ్యలూ, అక్కలూ వేర్వేరుగా ఉన్నా ఇప్పటికి మాది ఉమ్మడి కుటుంబమే. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. నేను ఎంత అదృష్టవంతుణ్ణి అనిపిస్తుంది. స్వేచ్ఛనిచ్చిన తల్లిదండ్రులు... విజ్ఞానాన్ని పంచిన గురువు... భారతీయుడిగా దేశసేవ... ఇప్పుడు రచయితగా కళాసేవ ఇంకేం కావాలి? అనే సంతృప్తికరమైన నవ్వు భువనచంద్ర నవ్వు. ●

# మహా సంగీత విద్వాంసుడు ద్వారం వేంకటస్వామి నాయుడు

బెంగుళూరులో పుట్టారు. విజయనగరంలో పెరిగారు. వాయులీనం (ఫిడేలు) పాశ్చాత్య వాయిద్యం. ఆ రోజుల్లో ఆ వాద్యాన్ని కర్ణాటక శాస్త్ర సంగీతానికి సరిరాదనే వారు. అలాటి ఛాందస రోజుల్లో ఆయన ఫిడేల్నే ప్రధానంగా చేసుకుని సోలో కచ్చేరీలు చేసేవారు. ఏ స్వరాన్నైనా, లయబద్ధంగా- ఆ తీగలపై పలికించగలిగే ధురీణుడాయన.

పాశ్చాత్యవాయిద్యమైన ఫిడేల్ను దేశీయ సంగీత వాయిద్యంగా చేసి, సోలో కచ్చేరీలు చేసిన ధురీణుడాయన.

ఫిడేలుకు మరోపేరు వయొలిన్. ఆ వయొలిన్ పదాన్ని తెలుగువారు వాయులీనంగా మార్చారు. అయితే ఆ వయొలిన్ సంగీత కచ్చేరీలలో పక్క వాయిద్యంగా ఉండేది. (ఇప్పటికీ ఉంటున్నది) ఆ వాయులీనాన్ని సోలోవాయిద్యంగా (ప్రధాన వాయిద్యంగా) చేసుకుని సంగీత కచేరీలు చేసిన మహా సంగీత వాద్య నిపుణుడు ద్వారం వెంకటస్వామినాయుడుగారు.

విజయనగరం అనేసరికి మహాకవి గురజాడ అప్పారావుగారు, హరికథా కేసరి ఆదిభట్ల నారాయణ దాసుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు వంటి కళా సంపన్నులు గుర్తుకు వస్తారు. సాహితీ కళాకారుల్ని పోషించిన విజయనగర రాజులు గుర్తుకు వస్తారు. ఆ నేల, అటువంటిది. రత్నగర్భ. సంగీత, నృత్య, నాటకాలను పోషించిన దివ్యసీమ. చతుషష్టి కళలకు నిలయమైన భూమి.



తెలుగునాట గల ఈశాన్య భూమిలో ఎందరో విశిష్ట కళా మూర్తులుదయించారు. జగద్విఖ్యాతి చెందిన మల్లయుద్ధ వీరుడు కోడి రామమూర్తి అక్కడివాడే.


1893 సం॥ నవంబరు నెల 8వ తేదీన ఆయన జన్మించారు. 1964 సం॥ము అదే నవంబరు నెలలోని 23వ తేదీన మరణించారు. ఆయన మరణించినా ఆయన శిష్య ప్రశిష్య బంధుజన కోటిలో ఎందరో వాయులీన విద్వాంసులు దేశం నలుమూలలా ఉన్నారు.

విజయనగరం రాజావారు ద్వారం వెంకటస్వామినాయుడుగారి నెంతో గౌరవించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. విశ్వవిఖ్యాత వయొలిన్ విద్వాంసుడు యెహుది మెనుహిన్‌గారు నాయుడుగారి వయొలిన్ కచ్చేరి విని ముగ్ధుడై 'మిమ్మల్ని' మించి వాయులీన విద్వాంసులుండరన్నారు. విఖ్యాత సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళిగారు నాయుడుగారి వద్ద సంగీతమభ్యసించారు. నాయుడిగారు కళావైదుష్యాన్ని మెచ్చి పద్మశ్రీ బిరుదముతో భారత ప్రభుత్వం గౌరవించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో గౌరవించింది. మద్రాసు మ్యూజిక్ అకాడమీ 'సంగీత కళానిధి' బిరుదప్రదానం చేసింది. వీటన్నిటికీ మించిన 1993సం॥లో తపాలాశాఖ నాయుడిగారి చిత్రంతో తపాలాబిళ్ళను విడుదల చేయడం. ఇలా యెన్నో గౌరవాలు పొందిన వాయులీన విద్వాంసుడు నాయుడుగారే!

# మక్కాలో పుట్టి మన దేశవాసుడై మన విద్యారంగాన్ని తీర్చిదిద్దిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్

## -కేంద్రంలోని తొలి విద్యాశాఖ మంత్రి-

భారతదేశం స్వతంత్ర ప్రతిపత్తిగల దేశంగా వరలిన తరువాత జవహర్ లాల్ నెహ్రూ తొలి ప్రధానమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేశారు. చాలా వరకు ఈ మంత్రివర్గంలో స్వాతంత్రోద్యమంలో పనిచేసిన వారినే మంత్రి వర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాటివారిలో ప్రధానంగా చెప్పుకోవలసిన కేంద్ర మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్. ఆయన 1888 సం॥ము నవంబర్ 11వ తేదీన- ముస్లిమ్‌ల పవిత్రపుణ్యక్షేత్రమైన మక్కాలో పుట్టారు. వారి పూర్వీకులు అక్బర్ కాలంలో ఆరేబియా వెళ్ళి మక్కాలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నా. ఆయన పుట్టిన వేళా విశేషమేమోగాని, ఆజాద్‌గారి రెండేండ్ల వయసులోనే ఆయన తండ్రి భారతదేశం వచ్చి కలకత్తా నగరంలో స్థిరపడ్డారు. ఆజాద్ బాల్య జీవితం, విద్యాభ్యాసం, విద్యాసంపన్నత అంతా కలకత్తా నగరంలోనే, ముస్లిం అయినా, ఆయన వేదాంత సిద్ధాంతాన్ని ఔపోసన పట్టారు. భారతదేశంలోనే చదివినా అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషల్లో పాండిత్యం సంపాదించారు. భూగోళ, ఖగోళ, గణిత, రసాయన శాస్త్రాల్లో కూడా పాండిత్యం సంపాదించారు. అధ్యాపక వృత్తి నెన్నుకుని, ఆ వృత్తిలో మేటి యనిపించుకున్నారు. రచనలు చేసారు. పత్రికలను నడిపారు. గ్రంథాలు రచించారు.



ఏ పనిచేసినా, నిబద్ధతగా చేసారు. ఆయన రాజకీయ ప్రవేశం విచిత్రంగా జరిగింది. బ్రిటిష్ ప్రభుత్వ విధానాల్నెదురిస్తూ సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని, కారాగార శిక్షననుభవించారు. అలా అలా ఆయన రాజకీయాల్లో ఎదిగి 1920, 1930, 1940, 1946 సంవత్సరాల్లో భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్ష పదవి నలంకరించారు.

హిందూ ముస్లిము సఖ్యత కోసం అవిరామకృషి చేసారు. పాకిస్థాన్ విడిపోయి ఎందరో ముస్లిములు తరలిపోయినా, ఆయన భారతదేశమే తన మాతృదేశంగా భావించి ఇక్కడే ఉండిపోయిరు.

ముస్లిము దేశంలో పుట్టి, ముస్లిముగా జీవిస్తూ భారత సంస్కృత పట్ల ఆసక్తి చూపిస్తూ, వేదాంత గ్రంథాధ్యయనం చేసి, విద్యావిధానంలో భారతీయతను ప్రస్ఫుటింపచేసిన ఆజాద్‌కు ప్రధాని నెహ్రూ విద్యాశాఖనే అప్పగించారు. ఆయన అవలంభించిన విద్యా ప్రణాళికలను, తరువాత వచ్చిన కేంద్ర విద్యామంత్రులు కొనసాగించి ఉంటే- భారతదేశంలో మరింత భారతీయతా, జాతీయ భావం వెల్లి విరిసేది. హిందూ ముస్లిముల మధ్యనున్న అగాధం తొలిగేది. తిరుగుబాటుదారులూ ఉండేవారు కాదేమో! అజాతశత్రుత్వం నెలకొనదేమో! మత విధ్వంసక చర్యలు మోదువారేవేమో!

మొహియుద్దీన్ అహ్మద్‌గా ఉన్న తన పేరును ఆజాద్‌గా మార్చుకున్న సహృదయత్వం ఆజాద్ స్వంతం.

# నవలా చిత్రాల నిత్య నవ్యపాద్యుడు!

# దుక్కిపాటి మధుసూదనరావు



'అ' తెలుగు భాష మొదటి అక్షఱం, 'A' ఆంగ్లభాష మొదటి అక్షఱం. 1950 దశకంలో సాంప్రదాయ చిత్రాలస్థాయి పెంచినది అన్నపూర్ణా సంస్థ. ఆ సంస్థ స్థాపక నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు సామాజిక చిత్రాలను నిర్మించే నవశకానికి నాంది పలికారు. ఆయనకు నాటకాల్లో ఉన్న అశేషానుభవం, కథలకు తగిన దర్శకుల నెన్నుకొనుటలో గల ప్రాభవము– అన్యులకంతగా లేదనే చెప్పాలి. ప్రముఖ దర్శకుడు కె.వి. రెడ్డిని దర్శకునిగా నెన్నుకోవడం, ఆదుర్తి సుబ్బారావులోని దర్శక శక్తిని గ్రహించి, దాదాపు వారన్ని చిత్రాలకు ఆదుర్తి సుబ్బారావునే దర్శకునిగా నియమించుకోవడం ముఖ్యంగా కథాశక్తిగల నవలలను తన చిత్రకథ వస్తువులుగా నెన్నుకుని చిత్రాలు నిర్మించడంలో ఆయన్ను మించిన నిర్మాతలు లేరని చెప్పాలి.

కళాశాల విద్యార్థిగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనటంతో నాటకరంగంతో దుక్కిపాటికి మంచి అనుభవం ఉండటంతో అక్కినేనిలోని సామర్థ్యత గమనించిన దుక్కిపాటి 'అన్నపూర్ణ' సంస్థను స్థాపించి, అక్కినేనిని చైర్మన్‌గా చేసి తాను మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించి, కె.వి. రెడ్డి దర్శకత్వాన 1955లో 'దొంగరాముడు' చిత్రాన్ని నిర్మించి అఖండ విజయం సాధించారు. జమున, నాగేశ్వరరావు, రేలంగి వంటి వారికి మంచి గుర్తింపు తెచ్చారు.

కథను ఎన్నుకోవడంలో దుక్కిపాటి ఘనాపాఠి. కథకే ఆయన ప్రథమ తాంబూలమిచ్చేవారు. ఆయన నిర్మాతగా తీసిన ప్రతి చిత్రంలోని కథకు అనేక కథాచర్చలు జరిపి అనుగుణమైన మార్పులు చేర్పులు చేసేవారు. దుక్కిపాటి గారి ప్రతిభంతా దర్శకుని ఎన్నుకోవటంలో కనిపించేది. ఆదుర్తిని 'తోడికోడళ్ళు' చిత్రానికి దర్శకునిగా చేసి, ఆయనకు దర్శకుని స్థాన సుస్థిరత కలిగించారు. ఆయనకు కథే అసలు హీరో. తను స్వయంగా ఆ కథా చర్చల్లో పాల్గొంటూ కథను కావలసిన స్థాయికి పెంచేవారు. రంగనాయకమ్మను, మారుతీరావును సంభాషణా రచనకు ప్రోత్సహించింది మొదట దుక్కిపాటివారే.

యద్దనపూడి నవలలను, కోడూరి కౌసల్యగారి నవలను (డా॥చక్రవర్తి) ఎన్నుకొని వాటిని సినిమా కథలుగా మలచిన విజేత ఆయనే! సినిమా విజయానికి సంభాషణలతోపాటు, పాటలు కూడా ముఖ్యమని నమ్మిన నిర్మాత దుక్కిపాటి.

శోభన్‌బాబు కొన్ని సినిమాల్లో హీరోగా నటించినా, ఆయనకు ఏకంగా సావిత్రి ప్రక్కన హీరోను చేసింది మధుసూదనరావుగారే. 'చదువుకున్న అమ్మాయిలు' హిట్‌కావడంతో శోభన్‌బాబు హీరోగా స్థిరపడ్డారు. ఆశాలత కులకర్ణి అనే గాయనిచే గుర్తింపు కలిగే పాటలు పాడించారు. భానుప్రకాష్ వంటి కేరెక్టర్ ఆర్టిస్టును సినిమా రంగానికి పరిచయం చేశారు. వాణిశ్రీలో నటనా వైదుష్యాన్ని గుర్తించి 'ఆత్మీయులు' చిత్రంలో ఆమెకు నాయకిగా అవకాశమిచ్చారు. సావిత్రి అకాల మరణంతో ఆమె స్థానంలో నాగేశ్వరరావు, రామారావు వంటి టాప్ హీరోల పక్కన నటించే అవకాశాన్ని పొంది, సావిత్రి స్థానాన్ని వాణిశ్రీ సుస్థిరం చేసుకుంది.

దుక్కిపాటి దేశభక్తుడు. మానవతావాది. సామాజిక వ్యవస్థపై ఆయనకు చక్కటి అవగాహన ఉంది. 'పాడవోయి భారతీయుడా' అనే దేశభక్తి గీతం సినిమాలో అయినా విడిగా బయట విన్నా మంచి ప్రబోధాత్మక గీతం.

కె. విశ్వనాథ్ వంటి డైరెక్టర్‌కు 'ఆత్మగౌరవం' చిత్రంతో ఆయన స్థానం స్థిరపడింది. గీత రచయిత దాశరథి సినిమాల్లో గొప్పపాటల రచయితగా రాణించారు. ప్రముఖ నాటక రచయిత కొర్రపాటి గంగాధరరావు సినిమా రచయితగా మారింది దుక్కిపాటివారి చలువవల్లనే. 'డాక్టర్ చక్రవర్తి' నవలకు సినిమా సంభాషణలు రాసింది గొల్లపూడి మారుతీరావే. దీనికి కారణం దుక్కిపాటి.

మూడుసార్లు జాతీయ స్థాయిలో 'ఊర్వశి' బిరుదు పొందిన శారదకు 'ఇద్దరుమిత్రులు' చిత్రంలో, తెలుగులో తొలి అవకాశం ఇచ్చారు. ఆయన నిర్మించిన 'అమాయకురాలు' తనకు మంచి పేరు గడించి పెట్టిందని శారద ఎప్పుడూ గుర్తు చేసుకుంటారు. ఆయన కచ్చితమైన మనిషి. అందుకే సూర్యకాంతం ఆయనను రింగ్‌మాస్టర్ అని ప్రశంసించేది. అలా తెలుగు చిత్రాల స్థాయి పెంచిన ఘనాపాఠి దుక్కిపాటి. అలాటి నిర్మాతలు రాకపోవడం తెలుగు సినిమా దురదృష్టం. ●

*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.

Grams : HOTELKRISH

Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153

Fax : 040 66663114

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

b-d

*Bhimas Deluxe Hotel*

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station), TIRUPATI - 517 501 (A.P.)**

**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**

**Website : www.bhimasdeluxehotels.com**

**E-mail : bhimasdeluxe@rediffmail.com**

# లిపి ధ్వనులు విధేయంగా కలిసి వుండాలి! వ్యావహారిక భాష వర్ధిల్లాలని కాంక్షించి ఉద్యమించినవారు 'గిడుగు రామమూర్తిగారు!

తెలుగుభాషలో రమ్యత లిపి, ధ్వనియేనని విశ్వసించిన వారు గిడుగు రామమూర్తి పంతులుగారు. వారు బరంపురంలో ఉండడం వల్లనోయేమో– అక్కడున్న సవర భాషకు నిఘంటువును కూడా రూపొందించారు. దీనికాయన తెలుగులిపినే వాడుకున్నారు. లిపి. ధ్వని, హ్రస్వదీర్ఘాలు భాషకు సొబసు కూరుస్తాయని వారు భావించారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుగారు సుళువైన పదవిన్యాసాన్ని రసరమ్యంగా వాడుకున్నారు. కానీ వాడుక భాష యనే ఒక మార్పును తెచ్చింది గిడుగు రామమూర్తి పంతులుగారే.



భాష జనబాహుళ్యంలోకి వెళ్ళాలంటే వాడుకభాషను వాడాలన్నది గిడుగువారి అభిప్రాయం. ద్విత్వాక్షరములూ, త్రిత్వాక్షరములను పలుకలేని వారుంటారు. వారి సౌలభ్యానికి వాడుకభాష అవసరమౌతూంది. ఆ రోజుల్లో స్త్రీల పాటలూ, జానపద గీతాలు నిరక్షరాస్యుల నోటంట కూడా చక్కగా పలుకబడ్డాయ్.

లిపిలేని కొన్ని భాషలవారిని అక్షరాలను దిద్దించాలని ఆయన ప్రయత్నించలేదు. పదికాలాలపాటు భాష ప్రజల నాలుకపై జీవించాలంటే– వాడుక భాష వినా వేరేలేదని భావించిన మాతృభాషా జనోద్ధరణ చక్రవర్తీ మార్గదర్శనం చేసినవారు గిడుగు రామమూర్తి పంతులుగారే! వారి పుట్టినరోజు ఫిబ్రవరి 16న తెలుగుభాషా దినోత్సవం చేసుకుని, అటు తరువాత మాతృభాషను పట్టించు కోకపోవడం విచారకరం.

బి.ఏ.టి. బేట్, సి.ఏ.టి. కాట్, ఆర్.ఏ.టి. రేట్ యని చదివించేవారికి మాతృభాషా రుచులేఁవి తెలుస్తాయ్!

వ్యావహారిక భాషలో తెలుగు అభివృద్ధిచెందగలదని భావించిన గిడుగు రామమూర్తి పంతులు చివరిశ్వాస వరకు కృషి చేసారు. అప్పుడే మాతృభాష వికసిస్తుంది, జనం నోళ్ళపై వర్ధిల్లుతుందని పంతులుగారు విశ్వసిం చారు, శ్వాసించారు.

ఆ ధ్యాస, ఆశా, ఆయన శ్వాసతోపాటు నిలిచి పోయిందాయని నా మనస్సులో మెదలుతూంటుంది. తెలుగు భాష వాడుకభాషగా నిలిచినంత కాలమూ జనం నోళ్ళపై నర్తిస్తూనే ఉంటుంది;రామమూర్తి పంతులుగారిని తలపిస్తూనే ఉంటుంది. ●

# సమాజంలో గౌరవంగా జీవించాలంటే ఏమి చేయాలి?

**–కె. మల్లికార్జున,** బళ్లారి

సమాజంలో గౌరవంగా బతకాలి, కీర్తిని పొందాలి, పదికాలాలపాటు మన పేరును స్మరిస్తూ మెచ్చుకుంటూ ఉండాలి అని అనునిత్యం అనుకుంటాము. అలా జీవించాలి అంటే మనం ఏమి చెయ్యాలి? ఎలా ప్రవర్తించాలి? ఎలా మాట్లాడాలి? మనము నిత్యం ఈ విషయాల గురించి ఆలోచిస్తుంటాము. మనము జీవించే ఈ కొద్దికాలం గౌరవంగా జీవించాలి. లేకపోతే మనిషికీ, పశువుకూ ఏమితేడా లేదు. భగవంతుడు ఇతర జీవులతో పోల్చుకుంటే బుద్ధి, విచక్షణజ్ఞానం, ఆలోచనా శక్తి, హృదయము ఇచ్చాడు. వీటిని సద్వినియోగం చేసుకుంటేనే ఈ జీవితం కళ్యాణమయం అమృతమయం.

అందుకోసం సనాతన ధర్మం ఎన్నో సన్మార్గాలను తెలియపరచింది. ఇదే విషయాన్ని మన పురాణాలు శాస్త్రాలు మహర్షులు తెలియజేశారు. వాటిని శ్రద్ధగా అధ్యయనం చేసినట్లయితే ఎన్నో మంచి విషయాలు అవగతమవుతాయి. వాటిని ఆచరించడం మన విధి, సంస్కారము.

ప్రధానంగా మన జీవన విధానం సాఫీగా, గౌరవంగా నడవాలంటే ఐదు 'వ'కారాలను ఆచరించాలని మన పెద్దలు చెప్పారు. అవి 1. వస్త్రం 2. వపుస్సు (శరీర కాంతి), 3. వాక్కు 4. విద్య, 5. వినయం. మనం ధరించే వస్త్రాలు పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉండాలి. పరిశుభ్రమైన వస్త్రాలు ధరించకపోతే సంఘములో ఆదరణ లభించదు. వస్త్రాలంకరణ బట్టే సమాజంలో పరపతి పెరుగుతుంది. ఇక వపుసు అంటే శరీరకాంతి శరీరవర్ణం బట్టి కలుగదు. శరీరం తెలుపా ఎరుపా, నలుపా రంగును బట్టి సమాజంలో గౌరవము లభించదు. ముఖం తేజోవంతంగా ఉండాలి. ముఖ సౌందర్యం, తేజస్సు విరాజిల్లాలంటే నిత్యం యోగ, ధ్యానం, జపం చెయ్యాలి. కామక్రోధాది వికారాలను పూర్తిగా మనసు నుంచి తరిమివెయ్యాలి. మనసు ప్రసన్నంగా, శాంతంగా ఉండాలి. ఎవరిమీదా పగద్వేషం పెంచుకోకూడదు. వీటివల్ల ముఖం కాంతివంతమవుతుంది. ఎప్పుడూ నవ్వుతూ అందరినీ పలకరించాలి. దగ్గరకు చేర్చుకోవాలి.

తరువాతది 'వాక్కు' అంటే మాట. వాగ్భూషణమే భూషణమ్ అని భర్తృహరి అన్నారు. వాక్కు మనిషికి భూషణం అంటే ఆభరణం వంటిది. సభ్యత, సంస్కారం కలిగిన మాట, మనకు సమాజంలో అపూర్వమైన ఖ్యాతిని తెచ్చిపెడుతుంది. మనమాట సౌమ్యంగా, ఆనందదాయకంగా ఉంటే ఎదుటివారు మనకోసం ఎంతటి త్యాగమైనా చేస్తారు. మాట అనేది గొప్ప వశీకరణ మంత్రం అని గోస్వామి తులసీదాసు అన్నారు. మననోటి నుంచి ఎన్నటకీ పరుషపదాలు, అసభ్య అశ్లీల పదాలు రాకుండా చూసుకోవాలి. సమాజంలో ప్రత్యక్షంగా, అతి శీఘ్రంగా, యశస్సును, కీర్తిని తెచ్చిపెట్టేది మన మాటే. మనసు మంచిదైతే మాట మంచిదవుతుంది. మంచి మాట మానవుణ్ణి దేవుడిగా మారుస్తుంది. మానవత్వంలో దైవత్వాన్ని ప్రతిష్ఠించేది మన మాటే. రామకృష్ణ పరమహంస, వివేకానందుడు వంటి మహనీయుల మాటలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తాయి. అందుకు కారణం వారి సాధన, ఏకాగ్రత, క్రమశిక్షణ, అధ్యయన శీలత.

నాల్గవది విద్య. విద్య మహత్తు తెలియనివారుండరు. విద్య వినయమును పెంపొందించును. రాజు తన రాజ్యంలోనే గౌరవమును పొందుతాడు. కానీ విద్వాంసుడికి అన్ని దేశాలలోనూ గౌరవం లభిస్తుంది. మనిషిలోని అజ్ఞానాంధ కారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించి సన్మార్గుడిగా చేసేది విద్య. ధనం పంచిన కొద్దీ తరుగుతుంది. కానీ విద్య పెంచిన కొద్దీ పెరుగుతుంది. అందుకే ఆశ్రమాల్లో నిస్వార్థంగా, జ్ఞానాన్నీ శిష్యులకు పంచి తమ జ్ఞానాన్ని పెంచుకొంటారు గురువులు.

అయిదో ప్రధానంశం 'వినయం'. వినయం విద్యను క్రమశిక్షణను, విజయాన్ని ప్రసాదిస్తుంది. సకల కార్యసాఫల్యానికి వినయమే పునాది. వినయంతో ఏదైనా సాధించవచ్చు. విద్య, కళ, నైపుణ్యం పొందాలంటే వినయం అతి ముఖ్యం. అహంకారంతో తలెత్తి పెరుగుతున్న మహావృక్షాన్ని, కిందనేల మీద ప్రవహించేనీరు నిలువునా కూల్చివేస్తుంది. బలహీనంగా ఉన్న గడ్డి పరక తలవంచుకునే ఉంటుంది. దానిని ఎంతటి ఉప్పెనయినా, ఏమి చేయలేదు. పెద్దలకు, గురువులకు, భగవంతునికి ప్రకృతికీ వినయవిధేయంగా ఉండాలి. వ్యక్తి సౌశీల్యానికి అలంకార ప్రాయం వినయమనే ఆభరణం. ఈ ఐదు ఆవశ్యక లక్షణాలను అలవరచుకుంటే ఆధ్యాత్మిక భావనతో మసలుకుంటే ఆత్మసంతృప్తి, గౌరవమైన జీవనం సమాజంలో కలుగుతుందని నమ్ముతాము. ●



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



89

## పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము

**13. గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మో జసా**
**పుష్ణామి చౌషధీఃస్సర్వాః సోమో భూత్వా రసాత్మకః**

**వ్యాఖ్య:-** 'ధారయామి ఓజసా'- అని చెప్పుట వలన జగత్తునందలి సమస్త పదార్థములకును, ప్రాణికోట్లకును శక్తిని, సామర్థ్యమును, బలమును ఒసంగునది ఆ పరాత్పరుడే యని తెలియుచున్నది. పైవాక్యమువలన శ్రీకృష్ణమూర్తి వసుదేవునకు జన్మించిన ఒకానొక చిన్న ఉపాధి మాత్రమే కాదనియు, విశ్వవ్యాప్తి, జగ్భర్తకూడ యనియు స్పష్టమగుచున్నది. మఱియు సస్యములను అభివృద్ధిపఱచునది తానేయని చెప్పుటచే జీవులు భుజించు ఆహారము సాక్షాత్ పరమాత్మవలననే సంభవించు చున్నదని తెలియుచున్నది. కావున, ఆహారమును భుజించునపుడు ఈ అన్న మెవరివలన మనకు వచ్చినది? అని ఆలోచించి అన్నస్రష్ట, అన్నదాతయగు ఆ సర్వేశ్వరునకు సర్వులును కృతజ్ఞత చూపవలసియున్నారు. మనుజుడు తాను ఆహారమును భుజించుటకు ముందు అద్దానిని ఆ దేవదేవునకు సమర్పించి తదుపరి దైవభావనతో దానిని భుజించవలెను. సస్యములను భగవానుడు పోషించనిచో జనులకు అన్నము దొఱకదు; సూర్యచంద్రాగ్నులకు ప్రకాశమివ్వనిచో లోక మంధకారావృతమై యుండును. కాబట్టి ఎన్నియో అనుకూలములు చేసి ప్రాణులను భరించుచున్న ఆ జగద్ధాత్రికి మనుజులు సదా కృతజ్ఞులై వర్తించవలెను. సర్వకాలము లందును, వారిని స్మరించుచు, కీర్తించుచు నుండవలెను.

**14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

**వ్యాఖ్య:-** క్రిందటి శ్లోకములో భగవానుడు తాను సస్యములను పోషించుట ద్వారా జీవులు తిను అన్నమును సృష్టించుచున్నానని పలికి, ఇపుడా యన్నమును తానే జీవుల శరీరములందు పచనమొనర్చుచున్నానని వచించుచున్నాడు. శరీరము ఆహారముచే నేర్పడుచున్నది. ఆ యాహారము జఠరాగ్నిచే పక్వముకానిచో, రక్తాదులద్వారా శరీరమంతటను వ్యాపించనేరదు, కావున జఠరాగ్ని శరీరమున కీలకస్థానమాక్రమించుకొనియున్నది. భగవానుడు తానే జఠరాగ్నిరూపమున అచ్చోట వర్తించుచున్నానని చెప్పుట వలన, దేహ నిర్మాత, దేహపోషణకర్త వారేయని స్పష్టమగుచున్నది. ఈ ప్రకారముగ ఆహారమును ధాన్యాదుల ద్వారా సృజించి, మఱల దానిని చక్కగా పచనముచేసి శరీరమునకు పుష్టిని కలుగజేయుచు జీవులకు మహోపకృతి నొనర్చుచున్న ఆ పరమాత్మకు కృతజ్ఞత చెల్లించక, ఆ అన్నము వారికి నివేదించక భుజించువాడు ఎంతటి కృతఘ్నుడు? అట్టివాడు దొంగయే యగునని పూర్వము శ్రీకృష్ణమూర్తి చెప్పియుండుట గమనించదగినది. (యో భుఙ్క్తేస్తేన ఏవసః (3-12)) కనుకనే ఆహారమును భుజించుటకు ముందు దేవునకు 'నైవేద్యము' సమర్పించు ఆచారము లోకములో నేర్పడినది. అట్లు దేవునకు నివేదింపకుండ, దైవభావనలేకుండ భుజించునది అపవిత్రమే కాగలదు. కాబట్టి ప్రతివారును తాము భోజనముచేయుటకు ముందుగా తమ యాహారమును దైవమునకు సమర్పించి, లేక అందలి కొంతభాగమును దైవస్వరూపులేయగు భూతకోట్లకు పెట్టి, భగవద్భావనతో భుజించవలెను. అప్పుడా భోజనమను క్రియ యజ్ఞముగాను, భుజించు పదార్థము అమృతముగాను మారిపోవును.

'ప్రాణినాం దేహమాశ్రితః'- అని చెప్పుట వలన భగవంతుడు అతి సమీపమున దేహమందే యున్నాడని నిశ్చితమగుచున్నది. కావున తమ శరీరమున దైవసన్నిధానమును అనుభవించుచు, భగవద్భక్తిగలిగి, పాపాచరణలేక జనులు పవిత్రమార్గమునే చేబట్టవలెను.

'పచామ్యన్నం చతుర్విధమ్' - పరమాత్మ జీవుల శరీరములో జఠరాగ్నిరూపమున వర్తించుచు, వారు తిను నాలుగు విధములైన ఆహారమును జీర్ణమొనర్చుచున్నారని తెలుపబడినది.

నాలుగు విధములైన ఆహారము - (1) భక్ష్యము (2) భోజ్యము (3) లేహ్యము (4) చోష్యము

(1) భక్ష్యము = దంతములచే కొఱికి తినబడు కఠినపదార్థములు, పిండివంటలు, కూరగాయలు మున్నగునవి.

(2) భోజ్యము = నాలుకచే చప్పరించి మ్రింగబడు మెత్తటి వస్తువులగు అన్నము మొదలైనవి.

(3) లేహ్యము = నాలుకచే రుచిచూడబడు పచ్చళ్ళు మొదలైనవి.

(4) చోష్యము = నోటిచే జుఱ్ఱబడు పాయసము, చారు, మజ్జిగ మున్నగునవి.

ఇట్టియాహారమును భగవానుడే జీర్ణమొనర్చుచుండుటవలన ఇక ఆహారవిషయమై మనుజుడెంత జాగరూకుడుగా నుండవలెనో యోచించుకొనవలయును. ఆహారసంబంధముగ ఈ క్రింద జాగ్రతలను పాటించుట ఉత్తమము- (1) అమితముగా భుజించి జీర్ణకర్తయగు భగవంతునకు పనిని కల్పించరాదు (2) సాత్త్వికాహారమునే భుజించవలెను. రాజస, తామసాహారములను వర్జించవలెను. (3) తిను ఆహారమును భగవంతునకు ముందుగా భక్తితో నివేదించవలెను. (4) ఆ యాహారము న్యాయార్జిత విత్తముచే నేర్పడినదిగా నుండవలెను. అధర్మమార్గముద్వారా సంపాదించిన ధనముతో పంచభక్ష్యపరమాన్నములను భుజించుటకంటె, న్యాయార్జితమైన సొత్తుతో లభించిన అంబలిత్రాగి బ్రతుకుట ఉత్తమము. భగవానుడు ప్రతివాని కడుపులో దాగి అంతయు గమనించుచున్నారు. కావున ఆహారాదివిషయములలో జనులు బహుజాగరూకులై యుండవలెను.

ఈ ప్రకారముగా ఈ అధ్యాయములో ఆహారవిషయమైన ప్రస్తావన విశేషముగ వచ్చియుండుటంబట్టి భోజనకాలమున ఈ అధ్యాయమును పఠించు ఆచారము లోకమున ఏర్పడినది. అనేక ఆశ్రమములందును, మఠములందును, గృహము లందును ఈ అధ్యాయమును సమష్టిగాను వ్యష్టిగా గాని భోజనకాలమున జనులు పఠించి తదుపరి ఆహారమును సేవించుచుందురు. ఈ ప్రకారముగ భగవద్భావనతో భుజించువానికి పెట్టబడు అన్నము సాక్షాత్ భగవంతునకు పెట్టబడినట్లేయగును. అంతటి పుణ్యమాతనికి తప్పక లభింపగలదు. మఱియు దైవధ్యానముతో భుజించుటవలన మనుజుని శరీరములోని అణువణువు దైవశక్తితో గూడియుండును.

భోజనము చేయుటకు ముందుగా 15వ అధ్యాయమంతయును చెప్పి చివఱకు చేతిలో తీర్థమును గ్రహించి 'బ్రహ్మార్పణం బ్రహ్మహవి" అను గీత 4వ అధ్యాయములోని 24వ శ్లోకమును భక్తితో పఠించి పిదప ఆ నీటిని అన్నముపైచల్లి ఆ పిదప భుజించుట ఉత్తమము.

*(తరువాయి వచ్చే సంచికలో)*